



ధర హాసమేది?


టన్ను రూ. ఏడువేల నుంచి 10వేలే..

ఆందోళనలో అరటి రైతులు

భారీగా తగ్గిన అరటి ధర

ఈ ఏడాది ధర తగ్గడంతో అరటి రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ధర ఎక్కువగా ఉండి మంచి లాభాలు రావడంతో చాలామంది రైతులు అరటి సాగు చేశారు. మరి కొందరు సాగు కోసం భూములను సిద్ధం చేసుకుంటు న్నారు. డ్రిప్ పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన అరటి పిలకల కొనుగోలు కోసం గతంలో సాగుచేసిన రైతుల వద్దకు వెళ్లి ఆరా తీస్తున్నారు. అరటి సాగు మెలకువలు, మార్కెట్‌ను లాభనష్టాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో అరటి ధరలు తగ్గడం వారిని ఆలోచనలో పడేస్తోంది.

- తాడిపత్రిటౌన్



విరగ్గాసిన అరటిపంట



టన్ను రూ.ఏడువేల నుంచి పది వేలు


గతేడాది టన్ను రూ.30 వేలకు పైగా పలకడంతో రైతులు అప్పులు చేసి మరీ అరటి పంట సాగు చేశారు. అయితే ప్రస్తుత రూ.7వేల నుంచి 10వేల వరకే ధర ఉండటంతో పెట్టుబడి కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి నెలలో టన్ను రూ.30వేల వరకు పలికింది. కానీ హఠాత్తుగా ఎందుకు పడిపోయిందో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ధర ఇలాగే ఉంటే చేసిన అప్పులు తీర్చలేమని రైతులు అభిప్రాయపడుతున్నారు.

దెబ్బేసిన మహారాష్ట్ర అరటి

మహారాష్ట్రలో సాగు చేసిన అరటి పంట ముందుగానే కాపునకు రావడంతో దళారులు తాడిపత్రి ప్రాంతానికి రాకపోవడం ఇక్కడ ధరలు తగ్గడానికి ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు. సాధారణంగా తాడిపత్రి ప్రాంతం నుంచి ఎక్కువగా ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలకు అరటిని రవాణా చేస్తారు. కానీ ఆయా రాష్ట్రాల్లో అరటి దిగుబడులు ఎక్కువగా రావడంతో ఏపీ వైపు దళారులు రాలేదని చెబుతున్నారు. అలాగే ఈ ప్రాంతంలో కూడా అరటి దిగుబడులు ఎక్కువ కావడంతో ధర భారీగా తగ్గిందని పేర్కొంటున్నారు. వేసవికాలం కావడంతో పంటలో నీటిశాతం తగ్గుతుందన్న ఆలోచనతో దళారులు సిండికేట్‌గా మారి ధరలను మరింత తగ్గిస్తున్నారు. వివిధ కారణాలతో గత నాలుగేళ్లుగా నష్టపోతూనే ఉన్నామని అరటి రైతులు వాపోతున్నారు. గత ఏడాది ధర ఉన్నా దిగుబడి లేక నష్టపోయినట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడుల కోసం తాకట్టు పెట్టిన బంగారాన్ని ఎలా విడిపించుకోవాలో అర్థం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేల హెక్టార్లలో అరటిసాగు

తాడిపత్రి ప్రాంతంలో ఐదు వేలకు పైగా హెక్టార్లలో అరటిసాగులో ఉంది. మిగిలిన మండలాల కంటే పుట్లూరు మండలంలో ఎక్కువ సాగు చేస్తున్నారు. ఈ మండలంలో 3500 హెక్టార్లు, యల్లనూరు మండలం 600 హెక్టార్లు, యాడికి మండలం 400 హెక్టార్లు, పెద్దపప్పూరు మండలం 300 హెక్టార్లలో అరటి సాగులో ఉంది. ఈ ఏడాది మరికొన్ని హెక్టార్లలో అరటి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా అరటిని తాడిపత్రి మండలంలోని కొనగుంటపల్లి, దిగువపల్లి, బ్రాహ్మణపల్లి, పుట్లూరు మండలంలోని జంగంరెడ్డిపేట, ఎల్లుట్ల, ఓబుళాపురం, కడవకల్లు, మడుగుపల్లి, అరకటవేముల, బాలాపురం, యల్లనూరు మండలంలోని తిమ్మంపల్లి, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి, అచ్యుతాపురం, పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, నామనాంకపల్లి, అమ్మలదిన్నె, యాడికి మండలంలోని చందన, కుందనకోట తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు.





ఐదెకరాల్లో సాగుచేసి నష్టపోయా

గతేడాది అరటి ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది ఐదెకరాల్లో సాగు చేశా. కానీ దేశంలోని చాలా రాష్ట్రాల్లో అరటి దిగుబడులు ఎక్కువగా రావడంతో దళారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. అరకొరగా వస్తున్న వారు పంటను తక్కువ ధరకు అడుగుతున్నారు. సాగుకోసం చేసిన అప్పును ఎలా తీర్చాలో తెలియడం లేదు.



- వెంకటరమణ, ఏ. కొండాపురం, పుట్లూరు మండలం

దళారుల సిండికేట్‌తోనే..

ఈ ఏడాది పంట దిగుబడి బాగుందని సంతోషించేలోపే దళారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించేస్తున్నారు. గతేడాది ధరలు బాగున్నప్పటికీ ప్రకృతి వైపరీత్యానికి అరటిచెట్లు నేలకొరిగాయి. నెలరోజుల క్రితం వరకు ధరలు ఆశాజనకంగా ఉండేవి. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధరలు కుప్పకూలాయి.



- పెద్దవీరనారప్ప, గడ్డంనాగయ్యపల్లి, నార్పల మండలం

దిగుబడి బాగుంది, ధర పడిపోయింది

ఆరు ఎకరాల్లో అరటిపంటను సాగుచేశా. దిగుబడి బాగుందని అప్పులు తీర్చేయవచ్చునని అనుకొనేలోపే ధరలు పడిపోయాయి. టన్ను రూ.10వేలు లోపే ఉండటంతో సాగు కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. ఇది ఇలాగే కొనసాగితే తీవ్ర నష్టాలు తప్పవు.



- గోవర్ధన్‌రాజు, కడవకల్లు, పుట్లూరు మండలం



దాడి వివరాలను పరిటాల సునీతకు తెలుపుతున్న మహిళలు

ఓటమి భయంతోనే దాడులు

రాప్తాడు ఎమ్మెల్యే తీరుపై పరిటాల సునీత ఫైర్

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసుకు పరామర్శ

చెన్నేకొత్తపల్లి, మార్చి 15: త్వరలో జరిగే ఎన్నికల్లో ఓడిపోతానన్న భయంతోనే ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి టీడీపీ నాయకులపై దాడులు చేయిస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. నాగసముద్రంలో జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనమని అన్నారు. నాగసముద్రంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసును శుక్రవారం ఆమె పరామర్శించారు. వైసీపీ నాయకులు దాడికి తెగబడిన వైనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిటాల సునీత విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నాయకులను హత్యచేసేందుకు వైసీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. నాగసముద్రంలో జరిగిన చిన్నపాటి వివాదంతో ఏ మాత్రం సంబంధంలేని పక్క మండలానికి చెందిన ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు అమర్నాథ్‌రెడ్డి రెండు వాహనాలలో 11 మంది అనుచరులతో రావడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్థులు అడ్డుకోకపోయి ఉంటే టీడీపీ నాయకుడు ఓబులేసును హత్యచేసేవారేమో అని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు అని చూడకుండా దూషిస్తూ, రాత్రివేళ గ్రామంలో మారణాయుధాలతో భయానక వాతావరణం సృష్టించారని అన్నారు. పోలీసుల సహకారంతోనే ఇదంతా జరిగిందని ఆరోపించారు. ఎన్నికల కోడ్ రాబోతున్న సమయంలోనూ వైసీపీ నాయకులకు పోలీసులు తొత్తులుగా వ్యవహరించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి యత్నించిన అందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. దాడికి వచ్చినవారిలో నలుగురు రౌడీ షీటర్లు ఉన్నారని అన్నారు. ఎస్పీ విచారించి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. దాడి ఘటనపై అమర్నాథ్‌రెడ్డితోపాటు మరో 11మందిపై ఎస్ఐ వెంకటేశ్వర్లకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర తదితరులు దండు ఓబులేసును పరామర్శించారు.

సర్వేలన్నీ టీడీపీకే అనుకూలం : కాలవ



కాలవను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, మార్చి 15: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 165 అసెంబ్లీ స్థానాలు, 23 ఎంపీ స్థానాలను దక్కించుకుంటుందని టీడీపీ రాయదుర్గం అభ్యర్థి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. కణేకల్లు పట్టణంలో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలోని రెండు ప్రముఖ సర్వే సంస్థలతో పాటు పలు సర్వేలు టీడీపీ అత్యధిక స్థానాలను సాధించబోతోందని తేల్చాయని అన్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో ప్రజలకు జగన్‌పై ఏస్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థమవుతోందని అన్నారు. ప్రచారంలో ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ధాటికి వైసీపీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అన్నారు. టీడీపీ నాయకుడు కురుబ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన రిహాన్, పొంపా, వంశీ, దాదాపీర్, సర్మాస్‌వలి తదితర 50 మంది పార్టీలో చేరారు.

ప్రైవేటు ఆస్పత్రిలో ఇంటర్ విద్యార్థిని మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆందోళన



మరణించిన అంకిత

అనంతపురం టౌన్/సెంట్రల్, మార్చి 15: నగరంలోని శ్రీనివాసా న్యూరో అండ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇంటర్ విద్యార్థిని అంకిత (17) చికిత్స పొందుతూ మృతిచెందడం వివాదాస్పదమైంది. అనంతపురం రూరల్ పరిధిలోని స్టాలిన్ నగర్‌కు చెందిన రాజు, నాగేశ్వరి దంపతుల కూతురు అంకిత కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఆరు నెలలు నుంచి శ్రీనివాసా న్యూరో ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది. ఆమెకు తలలో రక్తం గడ్డ కట్టిందని, ఇక్కడే చికిత్స చేస్తామని వైద్యులు చెప్పారని, అప్పటి నుంచి అంకితకు రెగ్యులర్‌గా ఇదే ఆస్పత్రిలోనే చికిత్స చేయిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. మూడురోజుల క్రితం పరిస్థితి విషమించడంతో అంకితను ఆస్పత్రిలో అడ్మిట్ చేయించారు. అయినా పరిస్థితి మెరుగుపడలేదు. ఆమెకు గురువారం రాత్రి రక్తం ఎక్కించారు. ఆ తర్వాత ఏం జరిగిందోగానీ, తెల్లవారేలోగా అంకిత ప్రాణాలు కోల్పోయింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమ కూతురు రాత్రంతా ఇబ్బంది పడుతున్నా కనీస సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. వారికి మద్దతుగా విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో ఆస్పత్రి యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప అక్కడికి చేరుకుని, బాధితులతో మాట్లాడారు. ఫిర్యాద చేస్తే కేసు నమోదు చేస్తామని నచ్చజెప్పారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డెమో ఉమాపతి తదితరులు అక్కడికి చేరుకుని విచారించారు. ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని అంకిత కుటుంబ సభ్యులు డీఎంహెచ్ఓను కోరారు. సుమారు నాలుగు గంటలపాటు ఆందోళన కొనసాగింది. ఆ తరువాత బాధితులు ఆందోళన విరమించారు.

సీఎం జగన్ నిర్లక్ష్యమే కారణం

ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయకుండా సీఎం జగన్ నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో పేదల ప్రాణాలను తీస్తున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. బాధిత కుటుంబ సభ్యులతో కలసి శ్రీనివాస ఆస్పత్రి వద్ద ఆయన ఆందోళనకు దిగారు. ఇంటర్ విద్యార్థిని అంకిత ఆరునెలలుగా డాక్టర్ వెంకటరమణ వద్ద చికిత్స పొందుతోందని, ఆ కుటుంబం నుంచి రూ.8 లక్షలు వసూలు చేసి, చివరికి విద్యార్థి ప్రాణాలను బలిగొన్నారని మండిపడ్డారు. విద్యార్థి మరణానికి కారణమైన ఆస్పత్రిని అధికారులు సీజ్ చేయాలని, బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



రోదిస్తున్న అంకిత కుటుంబసభ్యులు

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

ఎంపీ తలారి రంగయ్యకు అమిలినేని సవాల్



మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 15: వ్యక్తిగత విమర్శలు కాకుండా, అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ఎంపీ తలారి రంగయ్యకు టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సవాల్ విసిరారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద మూడువేల మంది మహిళలతో శుక్రవారం ఆయన మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐ-టీడీపీ రాష్ట్ర అధ్యక్షురాలు పొడపాటి తేజశ్విని, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న తెలుగు మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ, తనపై వ్యక్తిగత విమర్శలు చేసేముందు ఎంపీ రంగయ్య ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవుపలికారు. ఎంపీగా కళ్యాణదుర్గం ప్రాంతంలో ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. 'కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రోడ్లను బాగు చేయాలని మీ వైసీపీ నాయకులే నన్ను అడుగుతున్నారు. ఆ దిశగా అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ నేను ముందుకు సాగుతున్నాను. వ్యక్తి గత విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టి.. అభివృద్ధిపై డిబేట్‌కు సిద్ధమా..?' అని ఎంపీ రంగయ్యను ప్రశ్నించారు. తన కంపెనీలో ఆరువేల మందికి పైబడి ఉద్యోగాలు కల్పించానని, కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తాను ఇక్కడకు వచ్చానని అన్నారు. అభివృద్ధిలో పోటీపడాలని, ఇలా విమర్శలు చేసినంతమాత్రాన అదిరేది లేదు, బెదిరేది లేదని అన్నారు.

- ఎంపీగా పనిచేసిన తలారి రంగయ్య కళ్యాణదుర్గంలో ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని పొడపాటి తేజశ్విని విమర్శించారు. మంత్రిగా పనిచేసిన ఉషశ్రీ చరణ్ అవినీతి, అక్రమాలకు పెద్దపీట వేశారేతప్ప.. అభివృద్ధి చేసింది శూన్యమని అన్నారు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, ఇటువంటి దుర్మార్గపు పాలనకు స్వస్తి చెప్పేందుకు మహిళలందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.
- జగన్ పాలనలో దిశ చట్టం చేశారని, ఆ చట్టానికి అతిగతీ లేకుండా పోయిందని సంగా తేజశ్విని విమర్శించారు. జగన్ పాలనంతా దోపిడీ, అక్రమాలు, దౌర్జన్యాలకే పరిమితమైందని, అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అందరం ఏకతాటిపైకి వచ్చి టీడీపీ విజయమే ధ్యేయంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.



మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు



మాట్లాడుతున్న ఐ-టీడీపీ రాష్ట్ర అధ్యక్షురాలు పొడపాటి తేజశ్విని



తెలుగు మహిళలతో అమిలినేని సురేంద్ర



ఇఫ్తార్	: శనివారం సాయంత్రం 06:31
సెహరీ	: ఆదివారం ఉదయం 05:10

గెలిపిస్తే మీ కూలీని అవుతా..!

టీడీపీ హయాంలోనే ఉరవకొండ అభివృద్ధి: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ, మార్చి 15: ప్రజలు తనకు అండగా నిలబడి గెలిపిస్తే ఉరవకొండకు పర్మినెంట్ కూలీగా పనిచేయడానికి తాను సిద్ధమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలోని తొగటవీర కల్యాణ మండపంలో శుక్రవారం చేనేత కార్మికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే విశ్వ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలని కేశవ్ సూచించారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ రోజూ చెడ్డపేరు తెచ్చుకోలేదని అన్నారు. కబ్జాలు చేసే వ్యక్తులు కావాలో, అభివృద్ధికి పాటు పడేవారు కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని అన్నారు. టీడీపీ హయాంలోనే ఉరవకొండను అన్ని విధాలా అభివృద్ధి చేశామని అన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతి పక్షంలో ఉన్నా ప్రజల తరఫున తన గొంతును అసెంబ్లీలో వినిపిస్తానని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 1994 ఫలితాలను పునరావృతం చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కారు రాబోతోందని అన్నారు. ఉరవకొండలో పది రోజులకు ఒకసారి తాగునీటిని వదులుతున్నారని, టీడీపీ హయంలో మూడు రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేశామని గుర్తు చేశారు. పీఏబీఆర్ నుంచి ఉరవకొండకు తాగునీటి పథకాన్ని తెచ్చిన ఘనత తమదేనని అన్నారు. ఉదిరిపికొండ, ఉరవకొండ తాగునీటి పైప్‌లైన్ పనులను పూర్తిచేయలేని అసమర్థుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అడిగే దమ్ము, ధైర్యం లేని వ్యక్తి విశ్వ అని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే హంద్రీనీవా పనులు పూర్తి చేసి, 80వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 50 పడకల ఆసుపత్రిని తాము తెస్తే.. డాక్టర్లతో నడపలేని పరిస్థితి వైసీపీది అని విమర్శించారు. ఉరవకొండ మరింత అభివృద్ధి చెందాలంటే, రాష్ట్రంలోనూ, ఉరవకొండలోనూ టీడీపీనే ఉండాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల శ్రీనివాసులు, పెద్దకోట్ల శ్రీనివాసులు, రాజేష్, బీరేశేఖర్, పల్లా నరసింహులు పాల్గొన్నారు.

హవ్వ.. ఇదేం చోద్యం..!

ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన వైసీపీ అభ్యర్థి

బొమ్మనహాళ్, మార్చి 15: రాయదుర్గం నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ భవనాలను వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దీంతో ప్రజలు అవాక్కయ్యారు. ఆయన ప్రజాప్రతినిధి కాదు, అధికారి కాదు.. ఏ హోదాలో ప్రభుత్వ భవనాలను ప్రారంభించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొమ్మనహాళ్ మండలంలోని బొమ్మనహాళ్, బొల్లనగుడ్డం, దర్గాహోన్నూరు-1, ఏళంజి, గోవిందవాడ-1, కళ్లదేవనహళ్లి, లింగదహాళ్, ఉంతకల్లు గ్రామాలలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు జడ్పీటీసీ నీలవేణి, ఎంపీపీ పద్మ కూడా హాజరు కాలేదు. స్థానిక ఎమ్మెల్యే (వైసీపీ రెబెల్) కాపు రామచంద్రారెడ్డి, వైసీపీ ఎంపీ తలారి రంగయ్య కూడా హాజరు కాలేదు. దర్గాహోన్నూరులో వైస్ ఎంపీపీ నాగరత్నమ్మ, సర్పంచ్ రామాంజినమ్మ, ఎంపీటీసీ శ్రీదేవి మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన ప్రాంతాలలో ఎక్కడా ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరు కాలేదు. బొమ్మనహాళ్‌లో రైతు భరోసా కేంద్రాన్ని శిలాఫలకం ఏర్పాటు చేయకుండానే ప్రారంభించారు. ఆ తరువాత సాయంత్రం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవాలలో ఇతర ప్రాంతాలకు చెందిన యానిమేటర్లు పాల్గొనడం గమనార్హం. కళ్లదేవనహళ్లి ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో లింగదహాళ్ యానిమేటర్ శ్రీను పాల్గొన్నాడు. ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమలులోకి వచ్చే అవకాశం ఉండటంతో వైసీపీ నాయకులు హడావుడిగా ప్రారంభోత్సవాలు జరిపారు.



ఆర్‌బీకే భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న మెట్టు

నాగాభరణంపై ఊరేగిన చంద్రమౌళీశ్వరుడు



నాగాభరణంపై దర్శనమిస్తున్న స్వామివారు

ఉరవకొండ, మార్చి 15: పట్టణంలోని గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నాగాభరణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉత్సవమూర్తిని సాయంత్రం మేళతాళాల మధ్య ఊరేగించారు. గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగింపు సాగింది. స్వామివారు నాగాభరణంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, వీరశైవ సంఘం నాయకులు వీరప్ప తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారికి నెమలి వాహనోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఐదు గెలల అరటి

పెద్దపప్పూరు మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన రైతు రవిశంకర్ అరటితోటలో ఒక చెట్టుకు ఐదుగెలలు ఏర్పడ్డాయి. ఈ రైతు ఏడాది కిందట మహారాష్ట్రలోని ఓ కంపెనీ నుంచి డీలర్ ద్వారా 6300 అరటి మొక్కలు తెప్పించి తన ఐదెకరాల పొలంలో నాటాడు. వీటిలో ఒక అరటి మొక్క మాత్రం ఏపుగా పెరిగి ఐదుగెలలు వేసింది. ఈ విషయంపై హార్టికల్చర్ అధికారిణి ఉమాదేవిని వివరణ కోరగా జెంట్‌పిక్ జాతికి చెందిన అరటిమొక్క కావడంతో ఇలా జరిగి ఉండవచ్చునని తెలిపారు.

- పెద్దపప్పూరు



రాక్షస పాలనను అంతం చేద్దాం

ప్రజాపాలనకు స్వాగతం పలుకుదాం: బండారు శ్రావణిశ్రీ

గార్లదిన్నె, మార్చి 15: రాష్ట్రంలో జగన్‌రెడ్డి రాక్షస పాలనను అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పడబోయే ప్రజాపాలనకు స్వాగతం పలుకుదామన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరులోని ఓ ఫక్షన్ హాల్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. దీనికి నియోజవర్గం పరిశీలకుడు గుర్రప్పనాయుడు, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ... జగన్‌రెడ్డి రాష్ట్రం అభివృద్ధి మరచి.. ధనార్జనే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. ప్రతిపక్ష నాయకులపై కక్షపూరిత రాజకీయాలకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆలం, ముంటిమడుగు మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఐకమత్యంతో పనిచేసి బండారు శ్రావణిశ్రీని అధిక మెజార్టీతో గెలిపించి.. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, జనసేన నాయకుడు ఈశ్వర్ మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, దండు శీనా, గేటుక్రిష్టారెడ్డి, గుర్రం ఆదినారాయణ, ఇల్లూరు రామాంజి, గుత్తాబాలకృష్ణ, వడ్డేవన్నూర్, గుర్రం శీనా, పుల్లన్న, గోరకాటి వెంకటేసు, సుంకన్న, బాబయ్య, అంజి, చితంబరప్ప, రమణప్ప, చల్లానాగరాజు, శీనప్ప, మధు, సురేంద్ర, సాకే మురళి, దివే క్రిష్టమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

వైసీసీ ప్రచారంలో పంచాయతీ కార్యదర్శి

చర్యలు తీసుకోవాలని బండారు శ్రావణిశ్రీ డిమాండ్

శింగనమల/నార్పల, మార్చి 15: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌ఓ డొక్క కృష్ణపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన అతను.. రాజకీయ నాయకుల ప్రచారంలో పాల్గొనడం తగదన్నారు. పంచాయతీ కార్యదర్శిగా ఉండి విధులకు డమ్మా కొట్టి వైసీపీ ప్రచారంలో పాల్గొనడం ఏమిటని ప్రశ్నించారు. ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ విధులపై అతన్ని ప్రశ్నిస్తే ... తనకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయని బెదిరిస్తున్నట్లు తెల్సిందన్నారు. రాచేపల్లిలో ఓటర్ల జాబితాలో ఒకే వార్డులో 100పైగా డెత్ క్లైములు ఉన్న తొలగించలేదని, విధులకు కూడా సరిగా రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు సమగ్ర విచారణ జరిపించి.. డొక్క కృష్ణపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు.



వైపీపీ ఎన్నికల ప్రచారంలో రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి, బీఎల్ఓ డొక్క కృష్ణ

రెండు నెలల్లో ప్రజాప్రభుత్వం

అరాచక వైసీపీ ఇక ఇంటికే... : మాజీ మంత్రి పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, మార్చి 15: రాష్ట్రంలో మరో రెండు నెలల్లో ప్రజాప్రభుత్వం ఏర్పడబోతోందని, ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమాలు తప్పా చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. మండలంలోని గొల్లవాండ్లపల్లి, నామాల గ్రామాల్లో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో చెన్నేకొత్తపల్లి మండలంలో వైసీపీకి మద్దతు పలికారని, ప్రకాశ్‌రెడ్డి కేవలం అక్రమార్జనపై దృష్టి పెట్టారే తప్పా ప్రజా సమస్యలు, అభివృద్ధి గురించి ఏనాడూ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే, ఆయన సోదరులు చేసిన దౌర్జన్యాలతో చెన్నేకొత్తపల్లి ప్రజలు విసిగిపోయారని, త్వరలో జరిగే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించి టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, జనసేన కన్వీనర్ ఇటికోటి క్రాంతికుమార్, నాయకులు అంకే అమరేంద్ర, ఎజ్జేశంకర్, మాడెం సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బమ్మ, ప్రసాదమ్మ, వెంకీ, పసలపెద్ద వెంకటరాముడు, అంజి, నరసింహులు, మోహన్, జయరామిరెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్, రమేశ్, ఏపీ శివ, అమరేంద్రరెడ్డి, కోళ్లసూరి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి... : గొల్లవాండ్లపల్లిలో వైసీపీ నాయకులు రాజమ్మ, పోతలయ్య, శివకుమార్, బాస్కర్, ప్రవీణ్, గంగాధర్, కేశవ, సాయికిరణ్ టీడీపీలో చేరారు. నామాలలో కూడా వైసీపీ నుంచి ముగ్గురు టీడీపీలోకి చేరారు. వీరికి పరిటాల సునీత టీడీపీలోకి ఆహ్వానించారు.

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : రాప్తాడు పంచాయతీ పరిధిలోని రామినేపల్లి గ్రామంలో మాజీ మంత్రి పరిటాల సునీత సోదరుడు, రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రామగిరి మండలంలోని పేరూరు గ్రామం, ఆత్మకూరు మండలంలోని వద్దుపల్లి గ్రామం, కనగానపల్లి మండలంలోని నెమలివరం, యలకుంట్ల గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



గొల్లవాండ్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత



రామినేపల్లిలో..



పేరూరులో ..



వద్దుపల్లిలో ..



నెమలివరంలో ..

చేపల అపహరణకు యత్నం

అడ్డుకున్న మత్స్యకారులపై దాడి

శింగనమల, మార్చి 15: శింగనమల చెరువులో శుక్రవారం రాత్రి చెదళ్ల గ్రామానికి చెందిన వ్యక్తులు దొంగగా చేపలు పట్టడానికి యత్నించగా.. మత్స్యకారులు అడ్డుకున్నారు. దీంతో చెదళ్ల గ్రామానికి చెందిన వారు దాడి చేయడంతో సుమారు పది మంది మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి చెదళ్ల గ్రామానికి వైపు చెరువలో ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దొంగగా చేపలు పడుతున్నట్లు శింగనమల మత్స్యకారులకు తెల్సింది. దీంతో 15 మంది మత్స్యకారులు వెళ్లి.. చెదళ్ల గ్రామస్థులను అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. చెదళ్ల గ్రామస్థులు రాళ్లు, కట్టెలతో దాడి చేయడంతో పది మంది మత్స్యకారులు గాయపడ్డారు. గాయపడ్డవారిలో మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు వెంకటనారాయణ, మత్స్యకారులు చిన్న మల్లికార్జున, చంద్రశేఖర్, నాగేంద్ర, నాగరాజు, పెద్దమల్లికార్జున, సాయి, రాము, రామంజి, తోపా, మరో ఇద్దరు ఉన్నారు. గాయపడ్డ వారు శింగనమల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు శింగనమల పోలీస్ స్టేషన్‌లో చెదళ్ల గ్రామస్థులపై ఫిర్యాదు చేశారు.

పుట్టుకతో వచ్చిన శారీరక లోపాలకు ఉచిత చికిత్స

అనంతపురం టౌన్, మార్చి 15 : పుట్టుకతోనే పిల్లలకు వచ్చిన శారీరక లోపాలకు డీఈఐసీ సెంటర్‌లో ఉచితంగా వైద్యచికిత్స అందిస్తామని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆస్పత్రి ఆవరణంలో ఉన్న డీఈఐసీ సెంటర్‌లో ప్రపంచ పుట్టకతో వచ్చు లోపాల అవగాహన మాసోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా కాళ్లు వంకర పిల్లలకు చికిత్స నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 50మందికి ఆర్థోవైద్యులు డాక్టర్ ఆత్మారామ్. డాక్టర్ మహమ్మద్‌గౌస్ చికిత్స అందజేశారు. కార్యక్రమంలో డీఈఐసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణస్వామి, మేనేజరు రజిత, చిన్నపిల్లల వైద్యురాలు శ్రీవిద్య. పిజియోథెరపిస్ట్ ధరీష పాల్గొన్నారు.

'మాతృ వందన యోజన'ను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం టౌన్, మార్చి 15: గర్భిణుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృ వందన యోజనను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. శనివారం నుంచి ఈనెల 31 వరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ చేపడ్తామన్నారు. ఈ పథకం ద్వారా మొదటి సారి గర్భం దాల్చిన వారికి రూ. ఐదు వేలు, రెండో సారి గర్భం దాల్చిన వారికి రూ. 6 వేలు అంద జేస్తారన్నారు. అర్హులైన లబ్ధిదారులు వారి పరిధిలోని పీహెచ్‌సీల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కురుగుంట కార్యదర్శికి ఉద్యోగోన్నతి



హిదయతుల్లా

అనంతపురంరూరల్, మార్చి 15: మండలంలోని కురుగుంట గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శి హిదయా తుల్లాకు గ్రేడ్-1 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి లభించింది. రాయలసీమ జోన్‌లో గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న 50 మంది గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కన్నాబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం నలుగురికి ఉద్యోగోన్నతి పొందగా.. ఇందులో హిదయతుల్లా ఒకరు.

పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెద్దనగౌడ్



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 15: గుంటూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తనను ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో తనకు అవకాశం లభించడం ఆనందదాయకమన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

అనంతపురంరూరల్ : మండలంలోని పాపంపేట పంచాయతీలో జరుగుతున్న పైపులైన్ పనులను ఎంపీడీఓ పుల్లయ్య శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని బసవతారక నగర్, వీకే నగర్ ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈనేపథ్యంలో స్థానికంగా బోర్లను వేసి నీటి సమస్యను పరి ష్కరిస్తున్నామని తెలిపారు. పాపంపేట ప్రాంతంలో ఇప్పటి వరకు ఎనిమిది బో ర్లు వేశామని, వాటి నీటి సరఫరాకు పైపులైన్ పనులు చేయిస్తున్నామని అన్నా రు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, ఎంపీటీసీ సందీప్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మవరం రూరల్, మార్చి 15: మండలంలోని కుణుతూరు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామానికి చెందిన చందు (26) మరూరు టోల్‌ప్లాజ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతను వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో శుక్రవారం ధర్మవరానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలోని కుణుతూరు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి.. రోడ్డు పక్కన ఉన్న వేపచెట్టును ఢీకొన్నాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అతను అక్కడిక్కడే మరణించాడు. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు గూగూడులో హుండీ లెక్కింపు

నార్పల, మార్చి 15: గూగూడు కుళ్లాయిస్వామి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శోభ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విడిది దినాల్లో స్వామికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తామన్నారు.

పంటనష్టపరిహారం కోసం టీడీపీ ధర్నా

ఆత్మకూరు మార్చి 15: అర్హులైన రైతులందరికీ పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని మదిగుబ్బ గ్రామ సచివాలయం ఎదుట టీడీపీ నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా... కొండలు గుట్టలకు పరిహార ఇచ్చారని, అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కేవలం 134 మందికి మాత్రమే పరిహారం వచ్చిందని, మిగిలిన 500 మందికి పైగా రైతులకు పరిహారం అందలేదని వాపోయారు. రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షులు నరసింహులు, రాజేంద్ర, నాగరాజు, అక్కులన్నసూరి, గోపాల్, చిన్నరాజు, నరసింహులు, మాధవరాజు, కేశవ పాల్గొన్నారు.



సచివాలయం ఎదుట టీడీపీ నాయకుల ధర్నా

వేతన బకాయిలు చెల్లించాలి

అనంతపురం కల్చరల్, మార్చి 15: శ్రీరామిరెడ్డి, శ్రీ సత్యసాయి, సీపీ డబ్ల్యూఎస్ వాటర్ సప్లయ్ కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్ సొమ్మును వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ గౌతమికి వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 12 సంవత్సరాలుగా శ్రీరామిరెడ్డి, శ్రీ సత్యసాయి, సీపీడబ్ల్యూఎస్ వాటర్ సప్లయ్ స్కీమ్స్ ద్వారా 1200 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం డివిజన్లలో కార్మికులకు వేతనంలో ఒక్కో కార్మికుని నుంచి రూ.3500 కాంట్రాక్టర్ కోత విధిస్తున్నారన్నారు. దీనికితోడు నాలుగు నెలల వేతనాలు, 12 నెలల పీఎఫ్ చెల్లించాలని ఐదు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా పీఏబీఆర్‌లో నాలుగు నెలల వేతనాలు, 12 నెలల పీఎఫ్, హిందూపురంలో నాలుగు నెలల వేతనాలు, 24 నెలల పీఎఫ్, సత్యసాయి వాటర్ వర్క్స్‌లో ఏడు నెలల పీఎఫ్, నాలుగు నెలల వేతనాలు, కనగానపల్లి, రామగిరి స్కీమ్‌లో 24 నెలల వేతనాలు, పీఎఫ్ చెల్లించాల్సి ఉందన్నారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చప్పగా స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం క్రైం: ప్రజల సమస్యలపై ప్రశ్నలు, నిలదీతలు లేకుండానే నగరపాలిక స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం చప్పగా సాగింది. అధికారులు, సభ్యులు మమ అనిపించేశారు. శుక్రవారం నగర మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన మేయర్ చాంబర్‌లో ఈ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మేఘ స్వరూప్, నలుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు సమస్యలపై పెద్దగా ప్రశ్నలు వేయకుండానే సమావేశం ముగిసింది. నగరంలో మహిళలకు మరుగుదొడ్లు లేవని, వాటిని ఏర్పాటు చేయాలని అబూసాలెహా కోరారు. నగరంలో ఓ బిల్డింగ్ అక్రమ కట్టడం సంబంధించి స్పందనలో ఫిర్యాదు ఇచ్చానని, కానీ స్పందించలేదని అన్నారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా రామచంద్రారెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 15: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆయనకు నియాకపు ఉత్తర్వులు అందజేశారు.

న్యాక్‌లో మెరుగైన గ్రేడ్ సాధించాలి : వీసీ



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, మార్చి 15: జేఎన్‌టీయూకి న్యాక్ 'ఏ' గ్రేడ్ వచ్చిందని, ఇంకా మెరుగైన గ్రేడ్‌ను సాధించేందుకు కృషిచేయాలని వీసీ శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. న్యాక్ రిపోర్ట్‌పై శుక్రవారం వీసీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాక్ రిపోర్టును క్షణ్ణంగా పరిశీలించి.. లోపాలు గుర్తించి.. దిద్దుబాటు చర్యలు చేపడితే గ్రేడ్‌లో ఏ ప్లస్ సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో చైన్నై అన్నా యూనివర్సిటీ ఎమిరట్స్ ప్రొఫెసర్ త్యాగరాజన్, రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్.. : ఇంజనీరింగ్ కళాశాలల ఈఈఈ విభాగంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్‌షాప్ శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టలను పరిశీలించిన వీసీ శ్రీనివాసరావు వారిని అభినందించారు. కార్యక్రమంలో బీసీడీ సీఈఓ దేవకుమార్, కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనసాగిన పండ్లతోటల పరిశీలన

అనంతపురం అర్బన్, మార్చి 15 : జిల్లాలో ఉద్యాన, ఏపీఎంఐపీ రాష్ట్ర కార్యాలయ ప్రత్యేక బృందాలు రెండో రోజైన శుక్రవారమూ పండ్ల తోటలను పరిశీలించారు. బోర్ల ద్వారా నీటి లభ్యత తగ్గిపోవడం ద్వారా పండ్ల తోటల్లో బెట్ట పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు వీరు పర్యటిస్తున్నారు. ఏపీఎంఐపీ ఓఎస్‌డీ రమేష్, ఉద్యాన శాఖ కమిషనరేట్ అధికారులు వెంకటరావు, రత్నచార్యుల నేతృత్వంలో మూడు బృందాలు జిల్లాలోని ఆరు మండలాల్లో పర్యటించారు. ఒకటో బృందం కుందుర్పి, శెట్టూరు, రెండో బృందం కళ్యాణదుర్గం, బెలుగుప్ప, మూడో బృందం బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో పర్యటించాయి. చీనీ, మామిడి, వక్క, బొప్పాయి, మామిడి, మునగ తదితర పంటలను ఆ సభ్యులు పరిశీలించారు.

ఇంటి దావ..!

- పరీక్షలు ముగియడంతో సొంతూరు బాట పట్టిన ఇంటర్ విద్యార్థులు
- కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్

ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. నగరంలో ఉంటూ విద్యనభ్యసించిన విద్యార్థులు సొంతూరు బాట పట్టారు. హాస్టళ్లు, ప్రైవేట్ గదుల్లో ఉన్న విద్యార్థులు తమతమ లగేజీతో ఊర్లకు బయలుదేరారు. దీంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. శుక్రవారం కూడా ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులు కేటాయించకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.




- అనంతపురం కల్చరల్

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15: స్థానిక ఆర్డీటీ అనంత క్రీడాగ్రామంలో రాష్ట్ర సబ్‌జూనియర్ బాల, బాలికల జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీలను శుక్రవారం నిర్వహించారు. సుమారు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరుకావడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఎంపిక చేసిన క్రీడాకారుల వివరాలను ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు ప్రకటించారు. బాలుర జట్టులో నానిబాబు, రోహిత్, జ్యోతి ప్రకాష్, జనార్ధన్ (విజయనగరం జిల్లా), కుష్యంత్ (కృష్ణా జిల్లా), కార్తీక్, పార్థసారధి (గుంటూరు), శశి, మురళీ (అనంతపురం), వంశీ (చిత్తూరు), జగన్ (కర్నూలు), పవన్ (శ్రీకాకుళం), ధీరజ్ (నెల్లూరు), చరణ్‌తేజ (ప్రకాశం), బద్రినాథ్ (కడప), సాత్విక్ (కర్నూలు), మనోజ్ (విశాఖపట్నం), వీరబాబు (తూర్పుగోదావరి) ఉన్నారు. బాలికల జట్టులో.. దేవిప్రియ (శ్రీకాకుళం), చైతన్య, తేజస్విని, భువనేశ్వరి (విజయనగరం), తిరుమల (గుంటూరు), దీవెన, వాసంతి (ప్రకాశం), సానియా, భాగ్యలక్ష్మి (అనంతపురం), ఉమ, హిందూ, హేమలత (చిత్తూరు), పూర్ణిమ (తూర్పుగోదావరి), వినయ, సన్నీ (కడప), కృత్తిక (కర్నూలు) ఉన్నారు. ఈ నెల 20 నుంచి ఆర్డీటీ స్టేడియంలో శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఈనెల 28 నుంచి మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, చిత్తూరు రమేష్, కృష్ణా జిల్లా సాంబశివరావు, గుంటూరు నరసింహారెడ్డి, పీడీలు గోపాల్‌రెడ్డి, విజయ్, లతాదేవి, చంద్ర, సంజీవరాయుడు, సురేష్, కోచ్‌లు బద్రి, మహేష్, సింహాద్రి పాల్గొన్నారు.

హిందూ ధర్మప్రచార పరిషత్ స్పెషలాఫీసర్‌గా మోహనయ్య



అనంతపురం కల్చరల్, మార్చి 15 : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ స్పెషలాఫీసర్‌గా మోహనయ్య నియమితులయ్యారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక టీటీడీ కల్యాణమండపం ఆవరణలోని హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. టీటీడీ ఏఈ తిరుమల దివాకర్, టెక్నికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, లతాకుమారి, పండిట్ వేణు, ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పోరాటంతోనే మహిళలకు సమాన హక్కులు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

అనంతపురం కల్చరల్, మార్చి 15: నేటి సమాజంలో మహిళలు అనుభవిస్తున్న హక్కులు పోరాటంతో సాధించుకున్నవేనని జన విజ్ఞాన వేదిక నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మహిళా హాస్టల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కావాలని చేసిన పోరాటంలో దాదాపు 146 మంది మహిళలు తమ ప్రాణాల ర్పించారని, దీంతో 1975లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు హేమమాలిని, సత్యసాయి కళాశాల తెలుగు అధ్యాపకురాలు యమునారాణి, సమత, జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి, సమత నాయకురాలు రాధా, లక్ష్మి, శశికళ, రాజ్యలక్ష్మి, జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు జయలక్ష్మిరాజు సంస్మరణ సభ

అనంతపురం కల్చరల్ : ప్రముఖ హాస్య, వ్యంగ్య రచయిత్రి జయలక్ష్మిరాజు సంస్మరణ సభను ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహిస్తున్నట్లు అనంత రచయిత్రుల వేదిక నిర్వాహకులు నిర్మలారాణి, డాక్టర్ ప్రగతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయలక్ష్మిరాజు ఈనెల 8న అనారోగ్యంతో మరణించారని పేర్కొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం ప్రెస్‌క్లబ్ : ప్రసిద్ధ కథ, నవలా రచయిత డా. శాంతినారాయణ రచిం చిన 'గీతలు చెడిపి' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహిస్తున్నట్లు విమలా శాంతి సాహిత్య సాంఘీక సేవా సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు మేధావులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


పేరూరు సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక విద్యుత్ లైన్

రామగిరి, మార్చి 15: మండలంలో పేరూరు సబ్‌స్టేషన్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా లైన్, బ్రేకర్‌ను శుక్రవారం ప్రారంభించినట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. గతంలో 220 సబ్‌స్టేషన్ నుంచి ఒకే బ్రేకర్ ద్వారా పేరూరు, తిమ్మాపురం, నసనకోట, రామగిరి ఉండేవన్నారు. దీంతో అధిక లోడ్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ సమస్యను తొలగించేందుకు ప్రస్తుతం పేరూరు తిమ్మాపురం సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక బ్రేకర్‌ను రామగిరి, నసనకోటకు పాతబ్రేకర్ ద్వారా సరఫరా అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దీని వల్ల అధిక లోడ్‌లు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు హాజరయ్యారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

నార్పల, మార్చి 15: బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికల పాఠశాలలో బాలికలను చదువించు, బాలికలను రక్షించు అనే కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఖాద్రీశుడి వైభవం


ఆలయం వ్యూ


లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాదుడి మూలవిరాట్లు

● 19నుంచి బ్రహ్మోత్సవాలు ● పక్షం రోజులపాటు సంబరాలు
● శ్రీవారికి వివిధ వాహనసేవలు ● పులకించనున్న కదిరి


పవిత్రమైన పాలబావి


ధ్వజస్తంభం

కోరిన కోర్కెలు తీర్చే దేవుడు, కాటమరాయుడిగా పేరుగాంచిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఈనెల 19వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఏటా పాల్గుణ మాసంలో పక్షంరోజులపాటు సాగే ఈ ఉత్సవాలను సాక్షాత్తూ బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని భక్తుల నమ్మకం. అందుకే వీటిని బ్రహ్మోత్సవాలు అని పిలుస్తారు. ఈనెల 19న ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తాయి. ఈ పక్షంరోజులూ శ్రీవారు రోజుకో అవతారంలో దర్శనమిచ్చి, భక్తులకు కనువిందు చేస్తారు. దేశంలోని నవ నారసింహ క్షేత్రాల్లో ఒక్కటైన కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎంతో ప్రాశస్త్యాన్ని కలిగి ఉంది.

- కదిరి

మూలవిరాట్టు ఎంతో ప్రత్యేకం

నారసింహక్షేత్రాలకు భిన్నంగా కదిరిలో స్వయంభువుగా వెలసిన శ్రీవారు ప్రహ్లాద సమేతుడై గర్భాలయంలో కొలువుదీరారు. అష్టభుజుడైన నారసింహుడు దుష్టరాక్షసుడైన హిరణ్య కశిపుడిని తన తొడలపై పరుండబెట్టుకుని రెండు హస్తాలతో అతడి శిరస్సు, పాదములను అదిమిపట్టి, మరో రెండు హస్తములతో వజ్రతీక్షణములగు గోళ్లతో రాక్షసుడి వక్షస్థలమును చేదిస్తుండగా.. మిగిలిన నాలుగుహస్తముల్లో శంఖు, చక్ర, ఖేడ్య, ఖడ్గములను ధరించి ప్రహ్లాద సమేతంగా దర్శనమిస్తారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు శ్రీవారి గర్భాలయానికి ఎడమ భాగాన మరో ఆలయంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. అభిషేకం అనంతరం శ్రీవారి వక్ష స్థలం నుంచి స్వేద బిందువులు ఉద్భవించడం ఇక్కడి మరో ప్రత్యేకత.

కదిరి ప్రాంతంలో ముహూర్తాలు బంద్

ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం జరిగిన నాటి నుంచి ఈ ప్రాంతంలో వివాహాలు బంద్ అవుతాయి. నారసింహుడి కల్యాణానికి ఎదురు కల్యాణమా అని ప్రశ్నించే వారు కూడా ఈ ప్రాంతంలో చాలామంది కనిపిస్తారు. అందుకే ముహూర్త బలాలు ఎలా ఉన్నా బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాతే శుభకార్యాలను నిర్వహిస్తారు. ఈ పక్షం రోజులపాటు మాంసాహారానికి దూరంగా ఉంటారు.

కదిరి మల్లెల గుబాళింపు...

కదిరి మల్లెల గుబాళింపునకు దేశంలోనే పేరుంది. ఇక్కడి మల్లెలు వెదజల్లినంతగా ఏ ప్రాంత మల్లెలు సువాసనలు ఇవ్వలేవన్న పేరు ఉంది. బ్రహ్మోత్సవాల సమయానికి విరబూసే మల్లెలు మరింత సువాసనలు గుబాళిస్తాయి. ఇక ఈ ప్రాంతంలో మాత్రమే కన్పించే ధవణం, మరువం సౌరభాలు ఖాద్రీశుడికి ఎంతో ప్రీతిపాత్రం. బ్రహ్మరథంలో ఊరేగే శ్రీవారికి ధవణాన్ని మొక్కుబడిగా సమర్పిస్తారు. ఇటీవలి కాలంలో కదిరి ధవణాన్ని సెంటు, అత్తరు తయారీలో వినియోగిస్తున్నారు.

కోనేటి స్నానం.. పాప విమోచనం

ఆలయానికి పడమర భాగాన, అర్జున నది ఒడ్డున భృగుతీర్థం ఉంది. అక్కడ భృగు మహర్షి తపస్సు చేసి శ్రీవారిని స్మరించుకున్నారు. ఆ మహర్షి కోరిక మేరకు శ్రీవారు స్వయంగా శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలు అందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆ ఉత్సవ విగ్రహాలే ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో కొనసాగుతున్న తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నాయి. భక్తులు తొలుత భృగుతీర్థంలో స్నానం చేసి శ్రీవారిని దర్శించుకుంటే సర్వ పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం.

చూడదగ్గ ప్రదేశాలు


తిమ్మమ్మ మర్రిమాను

శ్రీఖాద్రీ లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్నఅనంతరం భక్తులు చూడాల్సిన క్షేత్రాలు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి. కదిరి, రాయచోటి మార్గంలో 12 కి.మీ. దూరంలో గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని యోగివేమన ఆలయాన్ని దర్శించుకోవచ్చు. అత్యంత విశాలమైన వటవృక్షంగా గిన్నిస్ రికార్డులోకి ఎక్కిన తిమ్మమ్మ మర్రిమాను కూడా ఇదే మార్గంలో నంబులపూలకుంట మండలం, గూటిబైలు వద్ద ఉంది. కదిరి-హిందూపురం రహదారిలో పాలబావి వెలసి ఉంది. ఎంత కరువు వచ్చినా ఈ బావిలో నీరు ఎండిపోకపోవడం, మండుటెండల్లో పొంగిపొర్లడం దీనిప్రత్యేకం.

అంకురార్పణతో మొదలు..

పదిహేను రోజులపాటు సాగే బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో మొదలై తీర్థవాదితో ముగుస్తాయి. కల్యాణోత్సవం నాటి నుంచి రోజూ ఓ ప్రత్యేక అవతార రూపుడై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఏడాదిలో అన్నిరోజులు ఆలయంలో మాత్రమే దర్శనమిచ్చే శ్రీవారు భక్తుల చెంతకే వెళ్లి దర్శనమివ్వడం బ్రహ్మోత్సవాల ప్రత్యేకం. 19న అంకురార్పణ, 20న కల్యాణోత్సవం, 21న హంసవాహనం, 22 సింహవాహనం, 23న హనుమంత వాహనం, 24న బ్రహ్మగరుడసేవ, 25న శేషవాహనం, 26న సూర్య, చంద్రప్రభలు, 27న మోహినీ ఉత్సవం, 28న ప్రజాగరుడ సేవ, 29న గజవాహనం, 30న బ్రహ్మరథోత్సవం (తేరు), 31న అలుకోత్సవం, 1న తీర్థవాది, 2న పుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఖాద్రి అంటే...

శ్రీ మహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నారసింహుడు వెలసిన కదిరి పట్టణ పూర్వ నామం ఖాద్రీపురం. ఖ అంటే విష్ణు పాదం అని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. నారసింహుడు ఈ ప్రాంతంలో పాదం మోపినందున ఖాద్రి అన్న పేరువచ్చిందనేది నమ్మకం. మరో పురాణ గాథ కూడా ప్రచారంలో ఉంది. 'ఖదిర' అనే పేరుగల చండ్ర వృక్షం నుంచి నారసింహుడు ఉద్భవించినందున ఈ క్షేత్రానికి ఖాద్రి అన్న పేరు వచ్చింది. కృతయుగంలో ఉద్భవించిన లక్ష్మీనారసింహుడి కోసం పట్నం పాలేగాళ్లు 10వ శతాబ్దానికి ముందే ఆలయాన్ని నిర్మించినట్లు ఆనవాళ్లున్నాయి. ప్రస్తుతం నారసింహుడి ఆలయం ఉన్నచోట 10వ శతాబ్దం మధ్యకాలంలో పశ్చిమ చాళక్య రాజవంశీకులు.. దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారు. 1245లో హరిహరరాయలు, బుక్కరాయలు నృసింహుడి సాలగ్రామాలను, అచ్యుతరాయలు అష్టభుజుడైన నృసింహుడి మూలవిరాట్, ఉత్సవమూర్తులను దుర్గాదేవి ఆలయంలో ప్రతిష్ఠించడంతో లక్ష్మీనారసింహుడి క్షేత్రంగా పేరొందింది. భృగుతీర్థంలో మునిగి ఉన్న ఉత్సవమూర్తులను వసంత రుతువులో వెలికి తీసి ప్రతిష్ఠించడం కారణంగా శ్రీవారిని వసంత వల్లభుడు అని కూడా పిలుస్తారు. మహాభక్తులైన 12 మంది అళ్వార్‌లు రంగమంటపాన్ని, కొక్కంటి పాలెగాళ్లు పడమర గోపురాన్ని, తాడిపత్రి పాలెగాళ్లు కొటాయి మంటపాన్ని నిర్మించారు.


ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం

రేపు గ్రూప్-1 పరీక్షలు

● 11,597 మంది అభ్యర్థులు.. 33సెంటర్లు
● పకడ్బందీగా నిర్వహించాలి : కమిషనర్

అనంతపురం టౌన్, మార్చి 15: పలు ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్, లైజన్ ఆఫీసర్లను నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి ఆదేశించారు. అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం గ్రూప్-1 సర్వీసెస్ స్క్రీనింగ్‌టెస్ట్ (ఆబ్జెక్టివ్‌టైప్) పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో 11,597 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని, వీరికోసం జిల్లా వ్యాప్తంగా 33 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10గంటల నుంచి 12గంటలవరకు, మధ్యాహ్నం2గంటలనుంచి సా యంత్రం 4గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఎక్కడా ఏచిన్న తప్పు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని చీఫ్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్‌లైట్స్. గాలి వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సెంటర్ వద్ద తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి పరీక్షాకేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులు రాంగ్ బంబ్లింగ్ జరగకుండా ఇన్విజలేటర్లు ముందుగానే తెలియజేయాలన్నారు. ఎలాంటి సెల్‌ఫోన్లు గానీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌గానీ అనుమతించబడవన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసినా ఏదైనా గుర్తింపుకార్డు తీసుకుని రావాలన్నారు. సమావేశంలో సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాద్. ఎస్డీపీలు ఆనంద్, శంకరయ్య, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మార్చి 15: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ దూరవిద్య ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ విభాగాధికారి ప్రొఫెసర్ జీవీ రమణ, ఏసీ డాక్టర్ శ్రీరాములు నాయక్ ఫలితాలను వివరించారు. జనవరిలో నిర్వహించిన పరీక్షలకు దాదాపు 630 విద్యార్థులు హాజరుగాకా 598మంది పాస్ అయ్యారన్నారు. 88శాతం విద్యార్థులు ఉత్తీర్ణ సాధించారని, విద్యార్థులు వారి ఫలితాలకోసం మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్‌లను సందర్శించాలని సూచించారు.

22న జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం

అనంతపురం అర్బన్, మార్చి 15: జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశాన్ని ఈనెల 22వతేదీ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి సలహా మండలి సభ్యులు, వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఇక పాత మార్గంలోనే రైళ్లు

గుంతకల్లు, మార్చి 15: దారి మళ్లించి పంపిన కొన్ని రైళ్లను శుక్రవారం నుంచి తథాతథంగా పాత రూటులోనే నడుపుతున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనుల కారణంగా డోన్ మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను గత వారంలో దారి మళ్లించగా, పనులు పూర్తయిన కారణంగా ఆ డైవర్టెడ్ రైళ్లను పాత రూటులో పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. హౌరా-సత్యసాయి ప్రశాంతినిలయం సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 22831), దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22832)ను, పూరీ-యశ్వంతపూర్ వీక్లీ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (నెం. 22883) రైలును నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తిఫోర్ట్ స్టేషన్ల మీదుగా గత వారంలో మళ్లించారు. శుక్రవారం నుంచి ఈ రైళ్లను గుత్తి, డోన్, నంద్యాల స్టేషన్ల మీదుగా పునరుద్ధరించామని తెలిపారు.

అనంతపురంలో హంపి ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్

హుబ్లీ-మైసూరు-హుబ్లీ మధ్యన నడిచే హంపి ఎక్స్‌ప్రెస్ (నెం. 16591/92) అప్ అండ్ డౌన్ రైళ్లకు అనంతపురం స్టేషన్‌లో తాత్కాలిక స్టాపింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మార్పు వెంటనే అమలులోకి వస్తుందని, ఈ స్టాపింగ్‌ను కొనసాగించేదీ, రద్దుపరచేదీ తర్వాత నిర్ణయిస్తామని అన్నారు.

హోళీకి అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు

హోళీ పండుగను పురస్కరించుకుని తూర్పు మధ్య రైల్వే జోనల్ అధికారులు ముజ్ఫర్‌నగర్-యశ్వంతపూర్ మధ్య గుంతకల్లు, అనంతపురం మీదుగా అప్ అండ్ డౌన్ రెండు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ముజ్ఫర్‌నగర్-యశ్వంతపూర్ (నెం.05271) రైలును మార్చి 29, ఏప్రిల్ 5 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 05272) ఏప్రిల్ 1, 8 తేదీల్లోనూ నడపనున్నట్లు పేర్కొన్నారు. ముజ్ఫర్ నగర్-యశ్వంతపూర్ మధ్యన నడిచే రైలు పేర్కొన్న తేదీల్లో శుక్రవారం మధ్యాహ్నం మూడున్నరకు ముజ్ఫర్‌నగర్‌లో బయల్దేరి ఆదివారం సాయంత్రం 7 గంటల కు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు యశ్వంతపూర్‌లో పేర్కొన్న తేదీల్లో సోమ వారం ఉదయం ఏడున్నరకు బయలుదేరి ముజ్ఫర్‌నగర్‌కు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైళ్లు ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, కాచిగూడ, జనగావ్, ఖాజీపేట్, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, పిప్రియా, నర్సింగపూర్, జబల్పూర్, కట్ని, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్ చౌకీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, ఆరా, పాటలీపుత్ర, హాజీపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తాయని వెల్లడించారు.

జన సింధూరం..!

● టీడీపీ అభ్యర్థికి ఘనస్వాగతం
● పల్లె కోడలికి టిక్కెట్‌తో సంబరాలు



ప్రచార ర్యాలీలో పాల్గొన్న పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు

కొత్తచెరువు, మార్చి 15: పుట్టపర్తి టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూరారెడ్డికి నియోజకవర్గంలో ఘనస్వాగతం లభించింది. అభ్యర్థిగా ప్రకటించాక తొలిసారి శుక్రవారం ఆమె నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా కొత్తచెరువు మండలంలోని కొడపగానిపల్లి సమీపంలో ఆమెకు టీడీపీ, జనసేన శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. భారీఎత్తున రెండు పార్టీలవారు తరలివచ్చారు. ముందుగా ఆమె వెంకటాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలో ఎన్నికల ప్రచార పత్రాన్ని నాయకులు, కార్యకర్తల నడుమ ఆవిష్కరించారు. అక్కడి నుంచి మూడు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. కొడపగానిపల్లి వద్ద గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు హారతిపట్టారు. కొత్తచెరువుకు చేరుకోగానే మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా వందలాది మహిళలతో హారతులు పట్టించి, మొక్కలను కానుకగా ఇచ్చారు. కొత్తచెరువు జనసేన కార్యాలయానికి వెళ్లిన సింధూరను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం నాలుగురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళల అభివృద్ధికి పాటుపడతా..

పుట్టపర్తి నియోజకవర్గంలో మహిళల అభివృద్ధికి పాటుపడతానని పల్లె సింధూర అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ గతంలో తాను తిరిగానని, ప్రజల సమస్యలు, మహిళల పరిస్థితులు, రైతుల కష్టసుఖాలు తనకు తెలుసునని అన్నారు. అందరి సమస్యల పరిష్కారానికి పాటుపడతానని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, విద్యార్థులపై దాడులు పెరిగాయనీ, ఈ ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందని విమర్శించారు. ఉపాధి లేక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళుతోందని అన్నారు. రైతులకు సబ్సిడీ పరికరాలు రాకపోవడంతో వ్యవసాయానికి స్వస్తి పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వైసీపీ ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించారని, కానీ వారు చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాబోవు ఎన్నికలలో టీడీపీని ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఆయన కుమారుడు పల్లె వెంకటక్రిష్ణ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొమ్మసిల్లిన సింధూర



టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి రాక సందర్భంగా కొడపగానిపల్లి నుంచి వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆమె శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో కొత్తచెరువు సమీపానికి రాగానే భారీ జనసందోహం రావడం, విపరీతంగా పూలు చల్లడంతో సింధూరారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. రద్దీకితోడు ఎండ తీవ్రత కారణంగా ప్రచార రథంపై ఆమె సొమ్మసిల్లిపడిపోయారు. ఆమెకు తెలుగు మహిళలు సపర్యలు చేయడంతో కోలుకున్నారు. ఆ తరువాత ప్రచారాన్ని కొనసాగించారు.

చీనీ రైతును ముంచుతున్న దళారులు

● పులివెందుల తరహాలో బహిరంగ వేలం నిర్వహించాలి : రైతు సంఘం డిమాండ్

అనంతపురంరూరల్, మార్చి15: దళారుల వ్యవస్థతో చీనీ రైతులు నష్టపోతున్నారని, మార్కెట్‌లో చీనీ కాయలకు బహిరంగ వేలం నిర్వహించాలని జిల్లా పండ్లతోటల సంఘం నాయకులు, చీనీ రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం చీనీ మార్కెట్ యార్డులో మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి, మార్కెట్ చైర్మన్ ఏకే ఫయాజ్‌ను కలసి వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో సరైన సాగునీటి వసతి లేకపోయినా సొంతగా బోర్లు వేసుకొని ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని జిల్లాలో అత్యధికంగా చీనీ సాగు చేసున్నారన్నారు. జిల్లాలో సుమారు 42,490 హెక్టార్లలో 10,62,260 టన్నుల చీని పంటను పండిస్తున్నారన్నారు. దళారుల కారణంగా గిట్టుబాటు ధర అందక రైతులు మోసపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈనామ్ విధానంలో రైతుల కంటే కొనుగోలుదారులకే అధిక లాభమని అన్నారు. పులివెందుల మార్కెట్ యార్డు తరహాలో ఇక్కడ కూడా బహిరంగ వేలం ద్వారా చీనీకాయలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పండ్లతోటలకు అనుగుణంగా మార్కెట్‌లో షెడ్ల నిర్మాణం చేయాలన్నారు. చీనిపంటను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని, మార్కెట్ నిబంధనల మేరకు కమీషన్ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, రైతులు నాగలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనంతరాముడు, శివారెడ్డి, చెన్నారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, కుళ్లాయప్ప, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలకు మహిళ బలి

● మనస్తాపంతో ఆత్మహత్య


అరుణ (ఫైల్)

తాడిమర్రి, మార్చి 15: మండలంలోని కునుకుం ట్ల గ్రామంలో భూతగాదాలకు ఓ మహిళ బలైపోయింది. భూమి విషయంపై అన్నదమ్ములు ఘర్షణ పడుతుండడంతో.. తమ్ముడి భార్య అరుణ(30) ఆవేశానికి లోనై ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కునుకుంట్లకు చెందిన పెద్దవెంగముని, పెద్దక్కకు కుమారులు ప్రసాద్, చిన్నవెంగముని ఉన్నారు. తండ్రి నుంచి కుమారులకు సంక్రమించిన భూమి విషయంలో తగాదా ఏర్పడింది. దీనిపై గత శుక్రవారం పెద్దకుమారుడు ప్రసాద్.. తమ్ముడు చిన్నవెంగముని, తండ్రి వెంగమునిపై దాడి చేశాడు. దీంతో చిన్నవెంగముని తల పగిలి ఆరు కుట్లు పడగా.. పెద్ద వెంగమునికి చెయ్యి విరిగింది. గత బుధవారం వారికి ఉన్న చీనీ తోటలో ప్రసాద్ చీనీ కాయలు కోసేందుకు ప్రయత్నిస్తుండగా.. చిన్నవెంగముని, అతడి భార్య అరుణ భూతగదా తెగేవరకు కాయలు కోయరాదని అడ్డుపడ్డారు. కాయలు కోస్తే తమ కుటుంబం ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించినట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే అరుణ ఆవేశానికి లోనై అక్కడే ఉన్న గడ్డి మందు తాగింది. విషయం తెలుసుకున్న భర్త చిన్న వెంగముని వెంటనే ఆమెను ఆర్డీటీ ఆస్పత్రికి.. ఆ తరువాత అనంతపురానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. కాగా బెంగళూరుకు తరలించే ముందు అరుణ మాట్లాడిందని, తనకు బలవంతంగా మందు తాపారని, తాపిన వారి పేర్లు కూడా చెప్పినట్లుగా చిన్నవెంగముని తెలిపారు. వీరికి కుమార్తె పల్లవి, కుమారుడు జశ్వంత్ ఉన్నారు. చిన్న వెంగముని అన్న ప్రసాద్, వదిన జయలక్ష్మి, వారి బంధువులు పెద్దగంగయ్య, చిన్న గంగయ్య, ప్రభాకర్, నారాయణస్వామి, వెంకటరమణ, చాకలి సత్యమయ్య.. తన భార్య మృతికి కారకులని చిన్నవెంగముని ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

రూ. 10.70 లక్షల నగదు స్వాధీనం

రాయదుర్గం, మార్చి 15: పట్టణంలోని గాలి మారెమ్మ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున రూ. 10.70 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక నుంచి వస్తున్న లారీని తనిఖీ చేయగా విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన వేరుశనగ వ్యాపారి కుమ్మరి రామాంజనేయులు ఎలాంటి రశీదులు లేకుండా రూ. 10.70 లక్షలు తీసుకురావడం పోలీసులు గుర్తించారు. వ్యాపారంలో భాగంగా వేరుశనగను బెళ్లకెరలో విక్రయించి డబ్బును తీసుకెళుతున్నానని చెప్పడంతో దీనిపై పంచనామా నిర్వహించి డబ్బును రాయదుర్గం తహసీల్దార్‌కు అప్పగించినట్లు సీఐ ప్రసాద్ బాబు తెలిపారు.

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

● షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప


కాళేశ్వర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న శిల్ప

పెనుకొండ, మార్చి 15: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శివసాయి మందిరం వ్యవస్థాపకుడు డాక్టర్ సాయి కాళేశ్వర్ ఆశయ సాధన కోసం శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నామని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప అన్నారు. శివసాయి మందిరంలో గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాళేశ్వర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, హరి, బాబు, ఆశ్రమ సిబ్బంది, పట్టణ ప్రముఖులు సాయి కాళేశ్వర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సాయికాళేశ్వర్ వర్ధంతి సందర్భంగా శివసాయి మందిరంలోని నవ్యశ్రీ ఆసుపత్రిలో శిల్ప ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 150 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఆపరేషన్లకు 40 మందిని ఎంపిక చేశారు. గత వారంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లు చేయించామని నిర్వాహకులు తెలిపారు.

కొలనులో పడి బాలుడి మృతి


హరికిరణ్(ఫైల్)

ఆత్మకూరు మార్చి 15: మండల పరిధిలోని సనప మాదవరాజులు స్వామి దేవాలయం కొలనులో హరికిరణ్ (10) అనే బాలుడు పడి మృతిచెందాడు. ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన వివరాలు మేరకు రామగిరి మండలం పోలేపల్లికి చెందిన హరికిరణ్ తల్లి తండ్రులతో కలసి మాదవరాజులు స్వామి ఉత్సవాలకు వచ్చారు. ఆలయం ఎదుట ఉన్న కోనేరు దగ్గర స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. గమనించిన స్థానికులు బయటికి తీసేలోగా మృతి చెందాడు. స్వామి దర్శనం కోసం వచ్చి కళ్లెదుటే కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

సూట్ లేకుండా చీనీకాయల కొనుగోలు

అనంతపురం రూరల్, మార్చి 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌లో సూట్ లేకుండా చీనీ కాయలు కొనుగోలు జరుగుతోందని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు తోటల వద్ద డబుల్ సూట్‌కు ఉత్పత్తులను అమ్ముకోవడం జరుగుతోందన్నారు. యార్డులో సూట్ లేకుండానే కొనుగోలు చేస్తారన్నారు.. అదేవిధంగా చీనీ వ్యాపారం చేయుటకు ఆసక్తి గల వారు, కొనుగోలు లైసెన్సు కొరకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 96038 88166 నెంబరును సంప్రదించవచ్చునన్నారు.

చేనేతకు పూర్వ వైభవం తెస్తాం: ఎమ్మెల్యే కేశవ్


టీడీపీలో చేనేత కుటుంబాలతో పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మార్చి 15: చేనేతకు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని తొగటవీర కల్యాణ మండపంలో శుక్రవారం చేనేత కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికుల కు మగ్గాలు, జాకార్డులు అందజేస్తామన్నారు. చేనేత రంగాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. చేనేతల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. చేనేతలను ఆదుకునే బాధ్యత తనదన్నారు. అనంతరం చేనేత సామాజిక వర్గానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. పెద్దకోట్ల రవి, బీరే శివ, ముకుందలతో పాటు మరి కొంత మందికి ఎమ్మెల్యే కేశవ్ పార్టీ కండువాలు వేసి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల శ్రీనివాసులు, పెద్దకోట్ల శ్రీనివాసులు, చందారాము, రాజేష్, బీరేశేఖర్, పల్లా నరసింహులు, రంగనాయకులు, కాశీనాథ్, ప్రభాకర్, హరి, సుదర్శన్ పాల్గొన్నారు.

జీతాలు అడిగితే... కోత విధిస్తారా..?

శ్రీరామిరెడ్డి కార్మికుల ఆగ్రహం


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు బైఠాయించిన శ్రీరామిరెడ్డి కార్మికులు

కళ్యాణదుర్గం, మార్చి 15: తమకు రావాల్సిన జీతాలు అడిగితే వాటిలోనే కోత విధించడం దారుణమని శ్రీరామిరెడ్డి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట శ్రీరామిరెడ్డి కార్మికులంతా బైఠాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు అందించే వేతనాలలో రూ. 3200లు కోత విధించడం దుర్మార్గమన్నారు. ఎన్నిసార్లు ఆందోళన చేసినా అధికారుల్లో ఏ మాత్రం చలనం రాకపోవడంతోనే కార్యాలయాన్ని ముట్టడించి పెద్దఎత్తున ఆందోళనకు దిగినట్లు వెల్లడించారు. పోలీసులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శ్రీరామిరెడ్డి కార్మికులతో చర్చలు జరిపినప్పటికీ ఫలితం రాలేదు. దీంతో రెండు వందల గ్రామాలకు శ్రీరామిరెడ్డి నీరు నిలిచి పోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫేజ్-4 కింద కళ్యాణదుర్గంలో పనిచేసే 135 మంది శ్రీరామిరెడ్డి కార్మికులందరికీ జీతాలు, పీఎఫ్, ఇతరత్ర సౌకర్యాలు కల్పించేంతవరకు ఈ నిరసన ఇలాగే కొనసాగిస్తామని హెచ్చరించారు.

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా బంద్

కూడేరు: తమకు రావాల్సిన వేతనాల్లో కోత విధించడంపై తాగునీటి కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నీటి సరఫరా నిలిపివేశారు. శుక్రవారం రోజున శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు వేతనాలు తగ్గించినట్లు అధికారులు, కాంట్రాక్టర్ చెప్పడంతో ఆగ్రహించిన కార్మికులు డీఈ శ్రీనివాసులు, ఏఈఈ లావణ్య, కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డిపై మండి పడ్డారు. ఆగ్రహించిన కార్మికులు నీటి సరఫరా చేసే మోటర్లు నిలిపివేశారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు నీటిని వదలమని తేల్చి చెప్పారు. ఇలా చేస్తే కేసులు పెడుతామని బెదిరించినట్లు కార్మికులు తెలిపారు.

వైభవంగా గురుసిద్ధావదూతల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, మార్చి 15: మండలంలోని నింబగల్లు గ్రామంలో శుక్రవారం గురుసిద్ధవదూతల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి రథాన్ని ఊరు బావి వరకూ లాగారు. తిరిగి రథాన్ని యథాస్థానానికి చేర్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అలాగే భగళాముఖి అమ్మవారికి పూజలు చేశారు.

బీసీల పార్టీని ఆదరించండి


టీ వీరాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

రాయదుర్గం రూరల్, మార్చి 15: బీసీల పార్టీ అయిన టీడీపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టీ వీరాపురం గ్రామంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తూ తెలుగుదేశం పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ సిద్ధప్ప, మాజీ సర్పంచ్ సుంకప్ప, నాయకులు గంగాదరశెట్టి, గంగన్న, సోమశేఖర్, భోజరాజు, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, లచ్చన్నచౌదరి, ఓబయ్య, హేమ్లానాయక్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుందాం

పుట్లూరు, మార్చి15: కలిసికట్టుగా పనిచేసి టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని టీడీపీ మండల నాయకుడు చవ్వా కులశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భేదాభిప్రాయాలు పక్కనబెట్టి టీడీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. శింగనమలలో శ్రావణిశ్రీ గెలిస్తేనే చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారన్న సెంటిమెంట్‌ను మరొకసారి నిరూపిద్దామన్నారు. త్వరలోనే మండల నాయకుల ఆధ్వర్యంలో శ్రావణిశ్రీ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని తెలిపారు. రెండురోజులక్రితం కడవకల్లు గ్రామంలో నిర్వహించిన ర్యాలీ, సభకు తరలివచ్చిన ప్రతిఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

జేసీ కుటుంబాన్ని దీవించాలని ప్రచారం


కరపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్, మార్చి15: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జేసీ కుటుంబాన్ని దీవించాలని శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీచేశారు. అభివృద్ధి కావాలంటే టీడీపీకి ఓటువేయాలని అభ్యర్థించారు. టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డికి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్లు విజయ్‌కుమార్, సురేష్, బింగి ప్రభాకర్, నాయకులు రాజశేఖర్, దేవపుత్ర, శీనా, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి కృషి: అమిలినేని


ముస్లింలకు భోజనాన్ని వడ్డిస్తున్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 15: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం ప్రజావేదిక వద్ద ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. కళ్యాణదుర్గం మున్సిపాల్టీ, కళ్యాణదుర్గం రూరల్, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలోని ముస్లింలు సుమారు ఆరు వేల మందికి పైబడి ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందును ప్రతి ఏటా తాను పెద్దఎత్తున ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది కూడా కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల పరిధిలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మైనార్టీల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ప్రతి ముస్లిం టీడీపీకి మద్దతిచ్చి టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

విస్తృతంగా భవిష్యత్తు గ్యారెంటీ ప్రచారం


కిష్టిపాడులో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 15: పట్టణంలోని పుట్లూరురోడ్డు, పోలీస్ స్టేషన్‌రోడ్డు, నవరంగ్‌టాకీస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వెళ్లి చిరువ్యాపారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, నాయకులు చింబిలి ప్రసాద్, కౌన్సిలర్ విజయ్‌కుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే టీడీపీ ధ్యేయం: జేసీ అశ్మిత్‌రెడ్డి

అభివృద్ధే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన పట్టణంలోని చిన్నబజారు, అల్లాబకాష్‌వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలను, వృద్ధులను పలకరించారు. ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌లు సరస్వతి, అబ్దుల్‌రహీం, కౌన్సిలర్ షెక్షావలి, జింకా లక్ష్మీదేవి, అరుణ, రేష్మాపర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కిష్టిపాడులో ..

పెద్దవడుగూరు: మండలంలోని కిష్టిపాడు గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీకాలనీ, ఆర్డీటీ కాలనీల్లోని ప్రజలను పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నారిని పలకరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

వలంటీర్లపై చర్యలకు వెనుకంజ

బొమ్మనహాళ్, మార్చి 15: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లకు నోటీసులు ఇవ్వడంలో బొమ్మనహాళ్ అధికారులు వెనుకంజ వేస్తున్నారు. మండలంలోని హరేసముద్రం గ్రామంలో కొందరు వలంటీర్లు, యానిమేటర్లు, వైసీపీ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి వెంట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ప్రచారం చేసేదే అనే శీర్షికతో వార్త ప్రచురింతమైంది. ఈక్రమంలో ప్రచారం పాల్గొన్న వలంటీర్లకు ఫోన్లు చేసి వార్త పత్రికల్లో వచ్చింది మీరు సంజాయిషీ ఇవ్వండి అంటూ బతిమిలాడుతున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంపీడీఓ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి కుళ్లాయినాయుడులను వివరణ కోరగా సంజాయిషీ ఇవ్వమని ఆ వలంటీర్లకు చెప్పామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని అన్నారు.

నీటి సమస్య పరిష్కారం

కూడేరు, మార్చి 15: మండల కేంద్రంలో కొంత కాలంగా వేధిస్తున్న తాగు నీటి సమస్యను పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో పరిష్కరించారు. 1వ వార్డులో నీటి సమస్య ఎక్కువగా ఉండటంతో గతంలో బోరు వేశారు. ప్రస్తుతం దానికి మోటార్ బిగించారు. దీంతో ఆ ప్రాంతంలో నీటి సమస్య తగ్గినట్లు స్థానికులు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

గుత్తి, మార్చి 15: పట్టణంలోని అనంతపురం రోడ్డులోని ఏఆర్ ఆసుపత్రి వద్ద తన ద్విచక్రవాహనం చోరీ అయినట్లు బాధితుడు భానుకిరణ్‌రెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఆర్ ఆసుపత్రి వద్ద కేటీడీయం250సీసీ ద్విచక్రవాహనాన్ని నిలిపి ఉండగా గురువారం రాత్రి దొంగలు ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారన్నారు. ద్విచక్రవాహనం తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు టౌన్‌బ్యాంక్ మహాజన సభ

గుత్తి, మార్చి 15: ది గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మహాజన సభను ఆదివారం స్థానిక వసుధ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వరప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో 2024-25బడ్జెట్ అంచనాలు, సిబ్బంది సర్వీస్ నిబంధనలు, జీతాలు, తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

గుత్తి ప్రభుత్వ సూపరింటెండెంట్‌గా ఎల్లప్ప

గుత్తి, మార్చి 15: పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎల్లప్పను నియమిస్తూ జిల్లా వైద్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఉద్యోగోన్నతిపై గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిద్దాం

గుంతకల్లుటౌన్, మార్చి 15: మత ఆధారిత పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిద్దామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సీఏఏను వ్యతిరేకిస్తూ స్థానిక పొట్టిశ్రీరాముల సర్కిల్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఈ చట్టం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు, నాయకులు సాకే నాగరాజు, దాసరిశ్రీనివాసులు, మారుతిప్రసాద్, చోక్కాసునీల్, సురేంద్ర, చంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు, మార్చి15: మండలంలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపేస్తున్నామన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి: ఆర్ఓ



మాట్లాడుతున్న ఆర్ఓ శ్రీనివాసుల రెడ్డి

గుంతకల్లు టౌన్, మార్చి15: ప్రశాంత వాతావరణంలో సాధారణ ఎన్నికలు జరగాలని ఆర్ఓ, ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాయలంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు, రూట్ అధికారులతో నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఏ సమయంలోనైన రావచ్చునని అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలల్లో ప్రధాని, సీఎం, ప్రజాప్రతినిధుల ఫొటోలు ఉంచరాదన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. నియోజకవర్గంలో 21 పోలింగ్ స్టేషన్ల పేరు మార్పునకు ఎన్నికల అధికారులకు పంపామ న్నారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ అధికారిని నియమించామని ఆ గ్రామంలో ఎలాంటి సమస్యలు, గొడవలు ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అధికారులు తప్పక పాటించాలన్నారు. సమావేశంలో తహసీల్దారు శేషపణి, మున్సిపల్ కమీషనర్ వెంకటరమణయ్య, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం విధుల బహిష్కరణ


విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

యాడికి, మార్చి15: తమకు రావాల్సిన మూడునెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం మూడు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలు ఇస్తే గానీ తమకు జీవనం జరిగేది కష్టమేనని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేతనాల విషయంపై పెన్నా సిమెంట్స్ ఫ్యాక్టరీ అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నప్పటికి స్పందించడం లేదన్నారు. కార్మికుల పట్ల యాజమాన్యం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా తాము విధులను బహిష్కరించినట్లు తెలిపారు. కార్మికులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కార్మికులు పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ అధికారులతో చర్చలు జరిపారు. ఈనెల 22 వరకు గడువు కావాలని అధికారులు కోరడంతో కార్మికులు సానుకూలంగా స్పందించారు.

టీడీపీ విజయానికి సైనికుల్లా శ్రమిద్దాం

● గుమ్మనూరు సోదరులు

పామిడి, మార్చి 15: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి సైనికుల్లా శ్రమిద్దామని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరులు శ్రీనివాసులు, నారాయణ స్వామి, నారాయణ, కుమారుడు ఈశ్వర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు పలువురు నాయకులను సంప్రదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీతోనే బీసీలకు సమన్యాయం జరుగుతుందన్నారు. గుంతకల్లు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంను ప్రజలు ఆదరించాలని వారు కోరారు. పట్టణంలోని కోట ఆంజనేయస్వామి దేవాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీలు జింకల సంజీవకుమార్, సత్యనారాయణ, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు, నాయకులు తిమ్మప్ప, సుంకప్ప, ఓబులేసు, రవీంద్ర, నాగరాజు, చంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ప్రాంత అభివృద్ధికి పాటుపడతాం

గుత్తి: వెనుకబడిన గుత్తి ప్రాంత అభివృద్ధికి పాటు పడతామని మాజీమంత్రి గుమ్మనూరు జయరాం సోదరులు నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని అనంతపురం రోడ్డులో టీడీపీ కార్యాలయంలో గుమ్మనూరు జయరాం సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, నారాయణ, తనయుడు ఈశ్వర్ మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్ర బాబు ఆదేశాల మేరకు గుంతకల్లు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు గుమ్మనూరు జయరాం సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమ న్నారు. 2024ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణస్వామి, ప్రభాకర్‌చౌదరి, సోమశేఖర్, రవి, సురేష్, ఎంపీటీసీ నారాయణస్వామి, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పామిడిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గుమ్మనూరు జయరాం సోదరులు, నాయకులు, కార్యకర్తలు

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే కూటమి లక్ష్యం

● మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, మార్చి 15: అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపి, ప్రజా ప్రభుత్వాన్ని నెలకొల్పి, రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కునారిల్లిపోతున్న వ్యవస్థలన్నింటిని చక్కదిద్దడానికే మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయ న్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు అనే సంకల్పంతో చిలకలూరిపేట సమీపంలో పెద్ద ఎత్తున ఆదివారం సాయంత్రం బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లు ఒకే వేదికపై నుంచి ప్రజలకు ఇచ్చే సందేశాన్ని వినేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

యాజమాన్య పద్ధతులతోనే తెగుళ్ల నివారణ


చీనీతోటను పరిశీలిస్తున్న అధికారులు

బెళుగుప్ప, మార్చి 15: చీనీపంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే తెగుళ్లను నివారించడం సాధ్యమవుతుందని ఉద్యానశాఖ ఏపీఎంఐపీ అధికారి రమేష్ పేర్కొన్నారు. మండలంలోని కాలువపల్లి, కోనంపల్లి గ్రామాల్లో ఉద్యాన శాఖ రాష్ట్రస్థాయి అధికార బృందం చీనీతోటల ను పరిశీలించింది. మొక్కలకు వేరుకుళ్లు, ఎండు తెగులు సోకినట్లు గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అధికారులు అజయ్‌కుమార్, శంకర్ నాయక్, కృష్ణ తేజ, రైతులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని అపిలేపల్లి గ్రామంలోని పండ్లతోటలను శుక్రవారం పలువురు అధికారులు పరిశీలించారు. రాష్ట్రస్థాయి ఉద్యానశాఖ అధికారి రత్నాచార్యులు అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, హార్టికల్చర్ సైంటిస్ట్ దత్తరెడ్డి, ఏఎఫ్ఏ కళాశాల సిబ్బందితో కలిసి ఏఎఫ్ ఎకాలజీ సంస్థ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధలలో పండించే పంటలను పరిశీలించారు. ఏఎఫ్ఏ ఎకాలజీ సంస్థ ద్వారా 22 మంది రైతులు 135 ఎకరాలలో ఐదు రకాల పండ్ల మొక్కలను పెంచారు. మామిడి పంటలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హార్టికల్చర్ అధికారులు గౌసియా, రత్నకుమార్, మంజునాథ, ఆర్‌బీకే సిబ్బంది, ఏఎఫ్ ఎకాలజీ సంస్థ కోఆర్డినేటర్ రుద్రయ్య, ఎంటీఎల్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

ఉరవకొండ, మార్చి15: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్‌సింహ పేర్కొన్నారు. మండలంలోని రాయంపల్లి, వ్యాసాపురం గ్రామాల్లో శుక్రవారం బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. వజ్రకరూరు మండలం పందికుంట గ్రామంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో విజయ్‌సింహ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్లు విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు, రేగాటి నాగరాజు, సీతారాములు, వెంకటేశు పాల్గొన్నారు.

సాధికార కుటుంబ సభ్యులకు అవగాహన



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు మల్లికార్జున

బెళుగుప్ప, మార్చి 15: టీడీపీ మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాల ప్రచా రంలో సాధికార కుటుంబ సభ్యులు కీలక పాత్ర పోషించాలని నాయకులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సాధికారిక కుటుంబ సభ్యులకు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడంపై అవగాహన కల్పించారు. ఒక్కో సభ్యుడు 60 మంది ఓటర్లను కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించాలన్నారు. టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య, తగ్గుపర్తి రాధాకృష్ణ, మల్లికార్జున, ఆవులెన్న సర్పంచ్ రాము, తగ్గుపర్తి, రాజన్న , విరుపాపల్లి, రాధాకృష్ణ, దబ్బర లక్ష్మీనారాయణ, విజయ, శివ, వెంకటస్వామి, జయరాములు, జనసేన, మండల అధ్యక్షులు సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలంపాట

యాడికి, మార్చి15: యాడికి గ్రామ పంచాయతీ ప్రతిఫల ఆదాయ వనరుల వేలంపాటను శనివారం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ వెంకటేష్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు డిపాజిట్ మొత్తం చెల్లించి పాల్గొనాలని ఆయన కోరారు.

మూడు కేంద్రాల్లో పది పరీక్షలు

బెళుగుప్ప, మార్చి 15: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో మల్లారెడ్డి తెలిపారు. మొత్తం 651 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

యల్లనూరు, మార్చి15: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జయప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. జంగంపల్లి, మేడికుర్తి, పీఎం కొండాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సౌకర్యాలను తనిఖీ చేశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.